సాక్షి పల్నాడు

ఆదివారం । 15 । జూన్ । 2025



దుర్గమ్మ సన్నిధిలో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శనివారం ఇంద్రకీలాద్రి పై గణపతికి విశేష పూజలు నిర్వహించా రు. అనంతరం గణపతి హోమాన్ని నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.10 అడుగుల వద్ద ఉంది. ఇది 136.9932 టీఎంసీలకు సమానం.

నేడు వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం



దుగ్గిరాల: పనుపు యార్డు సమీపంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి శాంతి కళ్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

విత్తన పంపిణీ లేనట్టేనా!

- ఆరంభమైన ఖరీఫ్ సీజన్
- నేటికీ అందని పచ్చిరొట్ట ఎరువులు
- సరఫరాలోనూ కోత
- ఆందోళనలో అన్నదాతలు



చాగంటివారిపాలెంలో దుక్కి సిద్ధం చేస్తున్న రైతు

ముప్పాళ్ల: ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. ముందస్తు రుతుపవనాల రాకతో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. రైతులు ముందస్తు సాగుకు సిద్ధమవుతున్నా పాలకులు నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. సీజన్ ప్రారంభానికి ముందే రైతుకు కష్టాలు మొదలయ్యాయి. భూసారం పెరగాలంటే పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలంటూ పెద్దఎత్తున వ్యవసాయశాఖ అధికారులు ప్రచారం చేస్తుంటారు. అయితే ఆ దిశగా రైతుకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు పంపిణీలో మాత్రం చిత్తశుద్ధి కనపడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు సబ్సిడీపై అందించే ప్రోత్సాహకాలు ఒక్కొక్కటి కనుమరుగవుతూ వస్తున్నాయి. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి. చివరకు వ్యవసాయ సీజన్‌కు ఆరంభంలో సాగు చేసే పచ్చిరొట్ట విత్తనాలు కూడా అందకుండా పోతున్నాయి.

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే విత్తనాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సొంత గ్రామంలోనే అందించేవారు. సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లి పెసర, మినుము, జీలుగ, జనుము గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా నేరుగా రైతుకు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పచ్చి రొట్ట విత్తనాల ఊసే కరువైంది.

వరి, పత్తి, మిరప విత్తనాల జాడే లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో మండలానికి సుమారు 400 క్వింటాళ్ల వరకు విత్తనాలు సరఫరా కావటంతో రైతుకు కావాల్సినంత, కావాల్సిన రకం సొంత గ్రామంలోని రైతు



పచ్చిరొట్టసాగు(ఫైల్)

భరోసా కేంద్రంలోనే తీసుకొని సాగు చేసుకునే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది 120 క్వింటాళ్లు మాత్రమే సరఫరా అయ్యాయి. ఎన్నికల సమయం కావటంతో రైతులు కూడా విత్తనాల పంపిణీపై ఆసక్తి కనపరచలేదు. ఇదే అదనుగా ఈ ఏడాది మరలా కోత విధిస్తూ 100 క్వింటాళ్లు మాత్రమే పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా అయినట్లు వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. మండలానికి కేటాయించే సరఫరాలో కోత విధిస్తుండటంతో రైతులకు విత్తనాలు అందటం లేదు. అధికార పార్టీ సిఫార్సులు ఉన్న వారికే విత్తనాలు దక్కే దుస్థితికి చేరింది.

గప్ చుప్‌గా పంపిణీ

ప్రభుత్వం సరఫరా చేసే అరకొర కేటాయింపులతో వ్యవసాయశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. కేవలం కూటమి నాయకులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే గప్‌చుప్‌గా వ్యవసాయ అధికారులు విత్తనాలు అందిస్తున్నారు. ఎవరైనా

మళ్లీ వస్తాయంటూ కుంటి సాకులు

విత్తనాలు అరకొరగా రావడంతో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. అడిగిన వారికి సమాధానం చెప్పుకోలేక తికమకపడుతున్నారు. రైతులు అడిగే ప్రశ్నలకు నోరు మెదపలేకపోతున్నారు. కొందరు కూటమి నేతలు సైతం విత్తనాల కోసం సిబ్బందిని వేధిస్తున్నారు. ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నారు. ఈ తరుణంలో వారి కోపం నుంచి తప్పించుకునేందుకు మాయమాటలు చెప్పి తప్పించుకోవాల్సిన దుస్థితి. ప్రభుత్వం కేటాయించిన వరకు రైతులకు అందిస్తామంటూ వ్యవసాయాధికారులు చేతులెత్తేస్తున్నారు.

విత్తనాల కోసం వెళితే స్టాక్ లేదంటూ సమాధానం ఇచ్చి వెనక్కి పంపుతున్నారు. పచ్చిరొట్ట సాగు చేపట్టాలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టే అధికారులు ఆ దిశగా విత్తనాలు సరఫరా చేయాలనే కనీసం పరిజ్ఞానం లేకపోవటం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

దిక్కు తోచడం లేదు



ఈ ఏడాది రుతుపవనాల రాక ముందుగా ఉండటంతో సీజన్ మొదలైంది. ఇంత వరకు పచ్చిరొట్ట ఎరువులు అందించలేదు. పంట సాగుకు నలభై రోజుల ముందు పచ్చిరొట్ట సాగు చేస్తేనే ఉపయోగం ఉంటుంది. అయితే ఇంత వరకు విత్తనాలు ఇవ్వలేదు. అదేమంటే వస్తాయి ఇస్తామంటున్నారు. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు.

– బద్దిగం ఎల్లారెడ్డి, దమ్మాలపాడు.

అవసరమైన విత్తనాలు అందించాలి



కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు అందించాలి. లేకుంటే రైతులు విత్తనాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పచ్చిరొట్ట సాగు పంటకు ఎంతో లాభదాయకం . రైతులు సబ్సిడీ ద్వారా అందించే విత్తనాలతోనే పచ్చిరొట్ట సాగు చేస్తుంటారు. విత్తనాలు అందివ్వకుంటే సాగు అదనపు భారమే అవుతుంది.

– గుంటుపల్లి బాలకృష్ణ, రైతుసంఘం నాయకులు

న్యూస్‌రీల్

వైభవంగా మల్లాది వెంకన్న శాంతి కల్యాణం



అమరావతి: మల్లాది గ్రామంలోని వట వృక్షాంతర్గత వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజల అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పుష్పమాలలు, తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు తొమ్మిది మంది దంపతులచే శాంతి కళ్యాణ ప్రక్రియను ఆలయ యాజ్ఞీకస్వామి పరుచూరు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పునఃప్రారంభమైన శ్రీవారి ఊయల సేవ



తెనాలి టౌన్: శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీవారి ఊయల సేవ శనివారం నుంచి పునః ప్రారంభమైనది. ఆలయ కార్యనిర్వహణాధికారులు వి.అనుపమ మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతి శనివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు ఊయల సేవ జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని సూచించారు. ఊయల సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించారు. కొండేపి వసుంధర బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మల్లారెడ్డి నగర్ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. రామలింగేశ్వర స్వామికి ఆలయ అర్చకులు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం రుద్రహోమం, నవగ్రహ, మండప దేవత హోమాలను చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

జిల్లా కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



బాపట్ల: జిల్లా కోర్టు భవన సముదాయం బాపట్ల పట్టణంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. తూర్పు బాపట్లలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ఇందిరానగర్‌లో ఖాళీగా ఉన్న 2.80 ఎకరాల భూమిని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భూమి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత దస్త్రాలను పంపాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట బాపట్ల తహసీల్దార్ సలీమా, సర్వేయర్లు వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

- ఆరు వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు



బాపట్లటౌన్: రెప్పపాటులోనే ద్విచక్రవాహనాలను మాయం చేసే ఘరానా దొంగలను బాపట్ల పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు వెల్లడించారు. బాపట్ల పట్టణం ఉప్పరపాలేనికి చెందిన రాజు నాగార్జునరెడ్డి, శారదాపురి కాలనీకి చెందిన ఉన్నాం వంశీ, మల్లావుల ధర్మతేజ, షేక్ చందు, జాలాది జాన్, మరో మైనర్ బాలుడు కలసి బాపట్ల పట్టణంతోపాటు, చీరాల రూరల్, చీరాల టూ టౌన్, వెదుళ్లపల్లి, బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ద్విచక్ర వాహనాలను, మోటర్, రెండు సవర్ల బంగారం గొలుసును దొంగతనం చేశారు. బాపట్ల పట్టణంలోని జగనన్న కాలనీకి చెందిన పాలతోటి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు పట్టణంలోని గుంటూరు ఫ్లైఓవర్ వద్ద గల చిల్లర గొల్లపాలెం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా తమ సిబ్బంది ఆరుగురులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనాలన్నీ తామే చేశామని అంగీకరించారు. ఆరు వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు రెండు సవర్ల బంగారపు గొలుసు, మోటర్‌ను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచి జైలుకు పంపిస్తామని తెలిపారు. కేసు ఛేదనలో ఎంతో కీలకంగా వ్యవహరించిన బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఎస్సై చంద్రావతి, సిబ్బంది ప్రభాకరరావు, మనోజ్, శ్రీనివాసరావు, పోతురాజు, కృష్ణకిషోర్‌లను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

నీట్ ర్యాంకర్ల ‘ఎయిమ్స్’

- జాతీయస్థాయి వైద్య విద్యాసంస్థల్లో సీటు సాధనే లక్ష్యం
- వివిధ కేటగిరీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల భావి ప్రణాళికలు

గుంటూరు ఎడ్యుకేషన్ : వైద్య విద్యా కోర్సుల జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్–2025)లో గుంటూరుకు చెందిన పలువురు విద్యార్థుల వివిధ కేటగిరీల్లో అఖిల భారతస్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి వైద్య విద్యా సంస్థల్లో (ఎయిమ్స్)తో పాటు దేశంలోని ప్రముఖ వైద్య కళాశాలల్లో సీట్లు సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులే స్ఫూర్తి



స్వస్థలం గుంటూరు. నాన్న భానుప్రకాష్ గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జువాలజీ అధ్యాపకునిగా పని చేస్తున్నారు. అమ్మ విజయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకురాలు. నీట్ ఓపెన్ కేటగిరీలో 262 ర్యాంకు వచ్చింది. తాజాగా ర్యాంకుతో ఎయిమ్స్‌లో సీటు సాధిస్తా.

– కారుమంచి విక్రాంత్, 9వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

ఎయిమ్స్‌లో చేరడమే లక్ష్యం



స్వస్థలం యర్రగొండపాలెం. నాన్న యేసానాయక్ జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. టెన్త్ వరకూ నవోదయలో, ఇంటర్మీడియెట్ గుంటూరు వచ్చి చదివాను. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 981మార్కులు సాధించాను. తాజా ర్యాంకుతో ఎయిమ్స్‌లో చేరాలని భావిస్తున్నాను.

– రమావత్ తరుణ్ కుమార్ నాయక్, 51వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీ

అమ్మానాన్నలు ప్రభుత్వ వైద్యులే



స్వస్థలం గుంటూరు. నాన్న డాక్టర్ గోవిందనాయక్, అమ్మ డాక్టర్ కరుణ జీజీహెచ్‌లో వైద్యులు. ఓపెన్ కేటగిరీలో 2,135వ ర్యాంకు సాధించా. కళాశాలలో అధ్యాపకులు అందించిన సహకారం, సందేహాల నివృత్తి, వీక్లీ టెస్టుల ద్వారా సబ్జెక్టు పరంగా పట్టు సాధించా. ఇది మెరుగైన ర్యాంకు సాధనకు దోహదపడింది. మంగళగిరి ఎయిమ్స్‌లో చేరతా.

– ఎం. అరవింద్, 13వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీ

వైద్యురాలిగా రాణించాలనే లక్ష్యం



స్వస్థలం నరసరావుపేట. నాన్న షేక్ మహబూబ్ సుభానీ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఓపెన్ కేటగిరీలో 1,184వ ర్యాంకు సాధించా. ఎయిమ్స్‌లో చేరే లక్ష్యంతో ఉన్నాను.

– షేక్ వసీమా, 80వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్

గైనకాలజిస్ట్‌గా సేవలు



స్వస్థలం నెల్లూరు. నాన్న కృష్ణారెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. వైద్య విద్యపై మక్కువతో రోజుకు 15 గంటల పాటు చదివాను. ప్రణాళికాబద్ధమైన కృషితోనే ఓపెన్ కేటగిరిలో 960వ ర్యాంకు సాధ్యమైంది. ఎయిమ్స్‌లో వైద్యవిద్య అభ్యశించిన తరువాత గైనకాలజిస్ట్‌గా రాణించాలనే లక్ష్యంతో ఉన్నా.

– నాగిరెడ్డి మనస్విని, 49వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్

అన్నయ్య స్ఫూర్తి



స్వస్థలం గుంటూరు. నాన్న రత్నాకర్ ఆర్కిటెక్చర్. అమ్మ రెబెకా విద్య సివిల్ ఇంజినీర్. గతేడాది నీట్‌లో క్వాలిఫై అయ్యి పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో సీటు సాధించిన అన్నయ్య ప్రణయ్ విక్టర్ బాటలో వైద్య విద్య అభ్యసించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత కార్డియాలజిస్ట్‌గా ఎదిగి, సమాజానికి సేవ చేస్తా.

– సోలే ప్రేమ్ జిద్సున్ ప్రసన్న, 108వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

నీట్‌లో సత్తా చాటిన పల్నాడు విద్యార్థులు



గజ్జల సాయికౌశిక్‌రెడ్డి



కోటి నాగహరికిరణ్



వద్దుల హంద్రీరామ్‌రెడ్డి



వసీమా



షేక్.నిహాల్‌పర్విజ్



నాగోతు రక్షిత్‌ఇన్న

సత్తెనపల్లి: వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష (నేషనల్ ఎల్జిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థులు సత్తా చాటారు. శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో సత్తెనపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ గజ్జల శారదారెడ్డి దంపతుల కుమారుడు గజ్జల సాయి కౌశిక్ రెడ్డి 603 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 1,169వ ర్యాంక్, జనరల్ కేటగిరీలో 650వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో గల భవిరిశెట్టి వారి స్ట్రీట్‌కు చెందిన కటకం వెంకట నాగ సర్వేశ్వరరావు, శిరీష దంపతుల కుమారుడు కటకం అనంత కోటి నాగ హరికృష్ణ 580 మార్కులు సాధించి ఆలిండియాలో 3,439వ ర్యాంక్, జనరల్ క్యాటగిరిలో 1,796వ ర్యాంకు సాధించాడు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామానికి చెందిన రైతు వద్దుల వెంకటరెడ్డి, పద్మ దంపతుల కుమారుడు వద్దుల హంద్రీ రామ్‌రెడ్డి 563 మార్కులు సాధించి ఆలిండియాలో 7,267వ ర్యాంక్, జనరల్ కేటగిరిలో 3,391వ ర్యాంకు సాధించాడు. ముగ్గురు విద్యార్థులు ఈనెల 8న విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్–2025లో జిల్లాలో ప్రతిభావంతులుగా నిలిచారు. ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ చేయడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నారు. నీట్‌లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను తల్లిదండ్రులతో పాటు పలువురు ప్రముఖులు శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

చినతురకపాలెం విద్యార్థిని 1184వ ర్యాంక్

నరసరావుపేటరూరల్: నీట్ యూజీ పరీక్ష ఫలితాలలో మండలంలోని చినతురకపాలెం గ్రామానికి చెందిన షేక్ వసీమా ప్రతిభ చాటింది. నీట్ పరీక్షలో 603 మార్కులతో జాతీయ స్థాయిలో 1184వ ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 80వ ర్యాంక్ సాధించింది. గుంటూరులోని ప్రైవేటు కళాశాలలో చదివిన వసీమా ఇంటర్మీడియేట్‌లో 988 మార్కులు సాధించింది. వసీమా తల్లిదండ్రులు ఇద్దరూ సచివాలయ ఉద్యోగులు. వసీమా సోదరుడు వాహిద్ గతేడాది నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటి మైసూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నీట్‌లో ప్రతిభ కనబర్చిన వసీమాను గ్రామస్తులు అభినందించారు.

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించిన మెడికల్ నీట్ పరీక్షలో పల్నాడు జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించారు. పట్టణానికి చెందిన షేక్ నిహాల్‌పర్విజ్ జాతీయస్థాయిలో 654వ ర్యాంక్ సాధించాడు. నీట్‌లో 720 మార్కులకుగాను 614 మార్కులు సాధించాడు. రావిపాడు గ్రామానికి చెందిన నాగోతు రక్షిత్‌ఇన్న 584 మార్కులతో 2909 ర్యాంక్ సాధించాడు.

వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరానికి కీలకమైన శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు అతి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పనుల వల్ల ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ రహదారులను సిద్ధం చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్యామ్నాయ రహదారుల పరిశీలనలో భాగంగా శనివారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జీఎంసీ అధికారులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్ నుంచి రెడ్డిపాలెం రోడ్డు, సంజీవయ్య నగర్ గేటు నుంచి నెహ్రూనగర్ గేటు వరకు, మూడు వంతెనలు, శారదా కాలనీ రోడ్డు, కంకరగుంట ఆర్‌యూబీ, కృష్ణానగర్ రోడ్డులను పరిశీలించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన పనులు జరిగే సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పలు రహదారులను నగరపాలక సంస్థ అభివృద్ధి చేసిందని చెప్పారు. సంజీవయ్య నగర్ గేటు నుంచి నెహ్రూనగర్ గేటు వరకు ప్రస్తుతం జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతులు పూర్తిచేసి రోడ్డు ఏర్పాటుచేయాలని కమిషనర్‌కి సూచించారు. మూడు వంతెనల వద్ద రైల్వే అధికారులను సమన్వయం చేసుకొని, వర్షాలకు మురుగు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ గుంటూరు నగరానికి శంకర్ విలాస్ వంతెన కీలకమని అన్నారు.

నీట్ ర్యాంకర్ వసీమా అందరికీ స్ఫూర్తిదాయకం



వసీమాను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అభినందించి సత్కరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నీట్ ఎగ్జామ్స్‌లో ఆల్ ఇండియా 80వ ర్యాంకు సాధించిన షేక్ వసీమా అభినందనీయురాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆ పాప సాధించిన విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మండలంలోని చినతురకపాలెం గ్రామంలో షేక్ సావమహబూబ్ సుభాని, సకిన దంపతుల కుమార్తె వసీమా శనివారం విడుదల చేసిన నీట్ ఎగ్జామ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆల్ ఇండియాలో 80వ ర్యాంకు సాధించింది. శనివారం సాయంత్రం వసీమా గ్రామానికి చెందిన తన బంధువు షేక్ సుభానితో కలిసి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిశారు. గోపిరెడ్డి ఆ విద్యార్థినిని సత్కరించి అభినందించారు. గోపిరెడ్డి మాట్లాడుతూ ఆల్ ఇండియాలో 80వ ర్యాంకు రావటం సామాన్యమైన విషయం కాదని అన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ అమలుచేసిన నాలుగు శాతం రిజర్వేషన్ వల్ల ఎంతోమంది మైనార్టీ అమ్మాయిలు, అబ్బాయిలు మంచి ర్యాంకులతో డాక్టర్లు, ఇంజినీర్లు అవుతున్నారన్నారు. వసీమాను అందరూ ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వసీమాను మునుముందు పీజీ, సూపర్ స్పెషాలిటీ విద్యను చదివించాలని సూచించారు. వారి కుటుంబంలో ఎనిమిది మంది డాక్టర్లు అంటే సామాన్య విషయం కాదని, ఓకే కుటుంబం ఎనిమిది మంది డాక్టర్లు కావటం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆ గ్రామంలో ఇప్పటికీ 30 మంది డాక్టర్లుగా డిగ్రీలు పొందారని, ఇంకా రెండు మూడు రోజుల్లో నీట్ విశ్లేషణ పూర్తయితే మరో ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు రావడానికి అవకాశం ఉందని అన్నారు. వారందరూ ఎన్నో విజయాలు సాధించాలని భగవంతుడిని కోరుకుంటున్నానని చెప్పారు. షేక్ కరిముల్లా, అచ్చి శివకోటి, వై.రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పని చేయాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ప్రతి ఉద్యోగి బాధ్యతతో పని చేయాలని ఈవో శీనానాయక్ చెప్పారు. దుర్గగుడి ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇతర ముఖ్య అధికారులతో ఈవో శనివారం పలు అంశాలపై చర్చించారు. ఇటీవల ఆలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులతో పాటు అంతర్గత బదిలీల అనంతరం బాధ్యతలు తీసుకున్న ఉద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి వారం ప్రధాన ఆలయాల ర్యాంకింగ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందని ఈఓ అన్నారు.

అదుపు తప్పిన లారీ



సంఘటన స్థలంలో లారీ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని కారంపూడి రోడ్డు సెంటర్‌లో శనివారం లారీ బీభత్సం సృష్టించింది. పిడుగురాళ్ల వైపు నుంచి అతి వేగంతో వస్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ ఇనుప గ్రిల్స్‌ని ఢీకొని దూసుకెళ్లింది. ఈ ఘటనలో 10 మీటర్ల పొడవునా ఇనుప గ్రిల్స్‌ పూర్తిగా దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్‌లో లారీ బీభత్సం సృష్టించడంతో ప్రజలు పరుగులు తీశారు. గ్రిల్స్‌ను ఢీకొని లారీ నిలిచింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్రేన్‌ సాయంతో లారీని పక్కకు తీశారు. హైవే అధికారులు కొత్త గ్రిల్స్‌ నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళపై కత్తితో దాడి



నరసరావుపేట టౌన్‌: మంచినీటి పంపు వద్ద చోటు చేసుకున్న వివాదం మహిళపై కత్తితో దాడికి దారి తీసింది. టూటౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచెరువు రాజీవ్‌ గృహకల్ప అపార్ట్‌మెంట్‌ వద్ద కుళాయిలో తాగునీరు పట్టుకునే విషయంలో చల్లా సుధారాణికి, గుంజి తిరుమలకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సుధారాణిపై తిరుమల, అతని తండ్రి వెంకటేశ్వర్లు కత్తితో దాడికి పాల్పడ్డారు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం

- వికసిత్‌ భారత్‌ లక్ష్యంతో స్వర్ణాంధ్ర సాధన
- బాపట్ల జిల్లా కలెక్టర్‌ వెంకటమురళి
- పిట్టలవానిపాలెంలో జిల్లా స్థాయి యోగాసనాల కార్యక్రమం



యోగా అవగాహన ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్‌ వెంకటమురళి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): యోగాసనాల వల్ల మానసిక ప్రశాంత కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండొచ్చని బాపట్ల జిల్లా కలెక్టర్‌ వెంకట మురళి చెప్పారు. యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జరిగిన యోగాసనాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ వెంకట మురళి ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు చేశారు. కేర్‌ న్యాచురోపతి వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన యోగాసనాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పిట్టలవానిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ వికసిత్‌ భారత్‌ లక్ష్యంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని చెప్పారు. వికసిత్‌ భారత్‌ దిశగా కేంద్రం, స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముదుకు వెళుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నదని వాటి ఫలాలను ప్రజలు అందుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం యోగాతోనే సాధ్యమవుతుందని యోగాసనాల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలు గుర్తించాలని కలెక్టర్‌ చెప్పారు.

సూర్యలంకలో 10వేల మందితో యోగాంధ్ర

ఈనెల 21న విశాఖపట్నంలో చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రధానమంత్రి హాజరవనున్నారని కలెక్టర్‌ తెలిపారు. జిల్లా స్థాయిలో సూర్యలంక తీరంలో 10వేల మందితో జరిగే యోగాలో ప్రజలంతా పాల్గొని యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయమ్మ, డ్వామా పీడీ జయలక్ష్మి, మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి, పశు సంవర్ధ శాఖ అధికారి వేణుగోపాల్‌రావు, ఎక్సైజ్‌శాఖ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ ఎలీషాబాబు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.



పిట్టలవానిపాలెం జూనియర్‌ కళాశాలలో యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్‌

చైన్‌ స్నాచింగ్‌ కేసుల్లో పాత నేరస్తుడి అరెస్టు

రూ.30 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌

నగరంపాలెం: ఒంటరిగా వెళ్లే వృద్ధ మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లే పాత నేరస్తుణ్ని గుంటూరు సీసీఎస్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ తెలిపారు. అతని నుంచి రూ.30 లక్షలు ఖరీదైన 300 గ్రాముల నగలు, బైక్‌ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లా పోలీస్‌ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్‌ నుంచి గత నెల 28 వరకు జిల్లాలో వరుస బంగారు గొలుసు చోరీలు జరిగాయని తెలిపారు. దీంతో సీసీఎస్‌ సీఐలు అనురాధ, అల్తాఫ్‌ హుస్సేన్‌, బి.శ్రీనివాస్‌తో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. గత ఆరు నెలలుగా సుమారు 700 నిఘా కెమెరాలను నిశితంగా పరిశీలించామని చెప్పారు. సాంకేతిక ఆధారాలతో ఆనందపేట ఒకటో వీధిలో ఉంటున్న నలభై ఏళ్ల షేక్‌ అమీర్‌బేగ్‌ అలియాస్‌ జోహరీని అదుపులోకి తీసుకుని విచారించినట్లు పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎనిమిది బంగారు గొలుసు దొంగతనాలకు ఇతడే పాల్పడినట్లు విచారణలో గుర్తించామని వివరించారు. అమీర్‌ బేగ్‌ను అరెస్ట్‌ చేసి బంగారు నగలు, మోటారు సైకిల్‌ స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. మరో రెండు బైక్‌లను గుర్తించాలని చెప్పారు. కేసులను త్వరితగతిన ఛేదించిన ఏఎస్పీ క్రైం సుప్రజ, డీఎస్పీ శివాజీరాజు, సీఐలు, సిబ్బందిని జిల్లాఎస్పీ అభినందించి, రివార్డులు అందించారు.

15 రోజులకు ఒక చోరీ

పెయింటర్‌గా పనిచేసే అమీర్‌ బేగ్‌ ఒంటరి మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లడంలో మంచి నేర్పరి. 2006లో మూడు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఆ తర్వాత నుంచి బంగారు గొలుసులు అపహరిస్తున్నాడు. 2014లో పాత గుంటూరు పీఎస్‌ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో జైలుకెళ్లి వచ్చాడు. అతనిపై 2016లో పాత గుంటూరు పీఎస్‌లో సస్పెక్ట్‌ షీట్‌ ఉంది. అప్పటికే సుమారు 22 కేసులు నమోదవ్వగా, ఇటీవల చేసిన ఎనిమిది కేసులతో 30 వరకు నమోదయ్యాయి. పదిహేను రోజులకు ఒకసారి రెక్కీ చేసేవాడని, అది కూడా గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు చేసేవాడని పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ వివరించారు. బాపట్ల జిల్లా వెళ్లి అక్కడ తాళం అరిగిపోయిన బైక్‌లను దొంగలించి, ఇక్కడికి వచ్చేవాడని చెప్పారు. చోరీలు చేసిన తర్వాత ఎక్కడ పడితే అక్కడే వాటిని వదిలేసి వెళ్లేవాడని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, సీసీఎస్‌ డీఎస్పీ శివాజీరాజు, సీఐలు జె.అనురాధ, ఎండీ.ఖాజా అల్తాఫ్‌ హుస్సేన్‌, బి.శ్రీనివాసరావు, పట్టాభిపురం పీఎస్‌ సీఐ జి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



అంబులెన్స్‌లో మొహమ్మద్‌, చిన్నారులు

యద్దనపూడి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. హైవే పరిరక్షణ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా వలపర్ల గ్రామస్తులు మొహమ్మద్‌, హసీరా దంపతులు, వారి ఇద్దరు పిల్లలు నహీరా, నసీర్‌లతో బైక్‌పై శనివారం గుంటూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా, యద్దనపూడి సమీపంలోని నక్కవాగు వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. వాహనం అదుపు తప్పి కిందపడగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొన్న వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌ సిబ్బంది గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్‌...

నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన షేక్‌ మహబూబ్‌ బాషా బైక్‌పై గుంటూరు వైపు ప్రయాణమయ్యాడు. మద్యం సేవించి ఆపై వేగంలో ఉన్నందున వాహనం అదుపుతప్పి యద్దనపూడి ఎస్‌ఎస్‌ఎల్‌ టెక్స్‌టైల్‌ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో వాహనంతోపాటు బాషా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్‌ సిబ్బంది బాధితుడిని గుంటూరులోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు.

కేంద్రియ విద్యాలయ విద్యార్థులకు అందని 'తల్లికి వందనం'

నాదెండ్ల: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని కేంద్రియ విద్యాలయ విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద సాయం అందలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై వారి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 400 మంది ఇక్కడ చదువుతున్నారు. పాఠశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతోపాటు స్వయం ఉపాధి, ప్రైవేటు రంగాల్లో పని చేసే వారి పిల్లలు కూడా ఉన్నారు. 25 శాతం మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నప్పటికీ 'తల్లికి వందనం' వర్తించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కార్పొరేట్‌ పాఠశాలల విద్యార్థులకు సైతం వర్తించిన పథకం తమ పిల్లలకు వర్తించకపోవడానికి ఏ పాపం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారి ఈమని కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రియ విద్యాలయాలకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్‌ చంద్రకళకు ఈ సమస్యను విన్నవించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పథకం వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్‌ గంగయ్య



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్‌ గంగయ్య

చీరాల అర్బన్‌: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్‌ గంగయ్య అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్‌ కార్యాలయంలో సీపీఎం బాపట్ల జిల్లా నాయకులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. మొదటి రోజు వర్తమాన రాజకీయ పరిణామాలుపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ప్రారంభమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా సుపరిపాలన అందించినట్లు చెప్పుకుంటుందని, ప్రజలు అటువంటి సంతృప్తి వ్యక్తం చేయడం లేదన్నారు. తల్లికి వందనానికి అనేక నిబంధనలు పెట్టి కోతలు పెట్టారన్నారు. పిల్లల చదువులకు ఇచ్చే డబ్బుల్లో కోత వేయడం సరికాదన్నారు. అర్హులైన అందరికీ తల్లికి వందనం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. రాష్ట్రానికి వనరులు రాబట్టుకోవడం, విభజన హామీలు అమలుపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు భావించారన్నారు. ఆచరణలో మాత్రం ఆ ప్రయత్నం జరగలేదన్నారు. సూపర్‌ సిక్స్‌ వంటి పథకాలు ఇంటింటికీ అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తోందని తెలిపారు. జిల్లాలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రజల సమస్యలపై జిల్లాలో సీపీఎం పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్‌, ఎస్‌.బాబూరావు, మణిలాల్‌, జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, వి.వెంకటరామయ్య, ఎం.ఆంజనేయులు, తిరుమల, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌ జీఎస్టీ కమిషనర్‌ నరసింహారెడ్డికి అవార్డు ప్రదానం



మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ నుంచి అవార్డు అందుకుంటున్న నరసింహారెడ్డి

లక్ష్మీపురం: తలాసీమియా రోగుల కోసం 2023, 2024 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 50కి పైగా కేంద్రాల్లో భారీ రక్తదాన శిబిరాలు నిర్వహించిన సెంట్రల్‌ జీఎస్టీ కమిషనర్‌ సాధు నరసింహారెడ్డికి భారత రెడ్‌ క్రాస్‌ సొసైటీ ప్రతిష్టాత్మకమైన 'కార్ల్‌ లాండ్‌స్టీనర్‌ 'అవార్డు అందజేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు నగరంపాలెం లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ నరసింహారెడ్డి నాయకత్వ నైపుణ్యం, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు. రక్తదాన కార్యక్రమాల్లో ఇతరులకు స్ఫూర్తి నింపేలా ఆయన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అవార్డు గ్రహీత నరసింహారెడ్డి మాట్లాడుతూ తమ సిబ్బంది ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా నెలకొల్పిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాల్లో 2023లో 1,440 యూనిట్లు, 2024లో 4100 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ కృషికి గానూ వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, జీనియస్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ తనకు గుర్తింపు కల్పించాయని తెలిపారు. ఇప్పుడు ఈ అవార్డు అందుకోవడం ద్వారా రక్తదాన సేకరణలో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. రెడ్‌ క్రాస్‌ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎ.కె.పరీద మాట్లాడుతూ రక్తదాన శిబిరాల ఏర్పాటు, సామాజిక సేవల్లో నరసింహారెడ్డి అందించిన అసాధారణ సేవలకు గుర్తింపుగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌ క్రాస్‌ సంస్థ ఉపాధ్యక్షులు పి.రామచంద్ర రాజు, జీఎస్టీ అధికారులు నాగరాజు, రవికుమార్‌, ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, పూర్ణ సాయి, శాఖమూరి శ్రీనివాస్‌, బిల్లా ప్రశాంత్‌ కుమార్‌ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి గాయాలు



నాదెండ్ల: మద్యం తాగిన ఇరువురు యువకులు ఘర్షణకు దిగటంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గణపవరం గ్రామంలో నివాసం ఉండే ఇరువురు ఒడిశా యువకులు స్థానిక స్పిన్నింగ్‌ మిల్లులో రోజువారీ కూలీ పనులకు వెళ్తుంటారు. శనివారం ఉదయం వారు షాపులో మద్యం తాగారు. మాటామాటా పెరగటంతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

వేటపాలెం: ఇంట్లో ఉరి వేసుకొని ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. రామన్నపేట పంచాయతీ బాపయ్యనగర్‌లో డొక్కా శ్రావణి (40) అనే మహిళ ఆరు నెలలుగా అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఓనర్‌ అద్దె అడగడానికి శనివారం వెళ్లి చూడగా.. ఉరి వేసుకొని కనిపించింది. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ జనార్దన్‌ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అలరించిన వైద్యురాలి కూచిపూడి నృత్యం



డాక్టర్‌ అపర్ణ

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు రోడ్డులోని గుంటూరు వైద్యకళాశాల (జీఎంసీ) ఆవరణలోని జింఖానా ఆడిటోరియంలో శనివారం వైద్యురాలు కంభంపాటి అపర్ణ కూచిపూడి నాట్య ఆరంగేట్రం చేశారు. వేదాంతం కళాక్షేత్రం (యూఎస్‌ఏ) వ్యవస్థాపకులు వేదాంతం రాఘవ, బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథ శర్మ, బ్రహ్మశ్రీ ముప్పవరపు సింహాచలశాస్త్రి, వైద్యులు హనుమంతురావు, కంభంపాటి మహాదేవ, వరలక్ష్మి దంపతుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేదాంతం రాఘవ శిష్యురాలైన డాక్టర్‌ అపర్ణ కూచిపూడి రంగప్రవేశం చేశారు. సంప్రదాయ ప్రార్థనతో మొదలై, పలు కూచిపూడి నృత్యాలకు ఆమె నాట్యం చేశారు. అమెరికాలో ఉంటున్న అపర్ణ దేశ సంస్కృతిని పరిరక్షిస్తూ, తొమ్మిదో ఏటనే నాట్యం నేర్చుకోవడం ప్రారంభించిందని వక్తలు పేర్కొన్నారు. ఒకవైపు వైద్య వృత్తిని అభ్యసిస్తూ, నాట్యంపై అభిలాష పెంపొందించుకోవడం అభినందనీయమని తెలిపారు. విద్యలో రాణిస్తూ, కూచిపూడిలో ప్రతిభ చూపడం గొప్ప విషయమని కొనియాడారు.

డేటా సమీకరణలో ఆన్‌టాలజీల పాత్ర కీలకం

మద్రాస్‌ ఐఐటీ సీఎస్‌ఈ ప్రొఫెసర్‌ శ్రీనివాసకుమార్‌



చేబ్రోలు: వివిధ వనరుల నుంచి వచ్చిన డేటాను ఒకే ఫార్మాట్‌లో సమీకరించడానికి ఆన్‌టాలజీలు ఉపయోగపడతాయని మద్రాస్‌ ఐఐటీ సీఎస్‌ఈ ప్రొఫెసర్‌ పి.శ్రీనివాసకుమార్‌ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్‌ యూనివర్సిటీలో ''సెకండ్‌ ఇంటర్నేషనల్‌ కాన్ఫరెన్స్‌ ఆన్‌ నెట్‌వర్క్స్‌ అండ్‌ సాఫ్ట్‌ కంప్యూటింగ్‌'' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శనివారం ముగిసింది. ప్రొఫెసర్‌ శ్రీనివాసకుమార్‌ మాట్లాడుతూ ఏఐ సిస్టమ్‌లు ఒక నిర్దిష్ట పరిసరాన్ని అర్థం చేసుకోవడం, నిర్ణయం తీసుకోవడం లేదా సహాయపడే విధంగా రూపొందించడంలో ఆన్‌టాలజీలు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. భాషను అర్థం చేసుకోవడంలో ముఖ్యంగా తర్జుమా, ప్రశ్నల సమాధానాలు, చాట్బాట్‌ల అభివృద్ధిలో ఉపయోగపడతాయని తెలిపారు. వాతావరణం, ట్రాఫిక్‌, విద్యుత్‌ వినియోగం వంటి డేటాను తెలివిగా ప్రాసెస్‌ చేయడంలో కూడా వినియోగిస్తారని చెప్పారు. జైపూర్‌లోని ఎంఎన్‌ఐటీ- సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ రమేష్‌బాబు బత్తుల మాట్లాడుతూ ఏఐ ఆధారిత వ్యవస్థలు బ్యాంకింగ్‌లో వినియోగదారుల ప్రవర్తనలను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించగలవని తెలిపారు. పౌరుల భద్రతను పెంచేలా సీసీ కెమెరాలు, ట్రాఫిక్‌ మానిటరింగ్‌, ఎమర్జెన్సీ సేవలను మరింత సమర్థంగా నడిపించడంలో ఏఐ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఐటీ- సిల్‌చార్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ కె.సుగన్య దేవి, ఎన్‌ఐటీ వరంగల్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ యూ.ఎస్‌.ఎన్‌. రాజు పాల్గొన్నారు.